# కళామతల్లికి జోహారు

అదొక సన్మాన సభ ! ప్రసిద్ధ చిత్రకారుడు కుమారస్వామికి సన్మానం.

ఈనాడు జరుగుతున్న అన్ని సభల్లానే దానికి కూడా రాజకీయపు రంగు పులిమి అసలు ప్రయోజనాన్ని పక్కకు నెట్టారు కార్యకర్తలు. ఒక ఎమ్.ఎల్. ఎ., ఇద్దరు రాజకీయ నాయకులు, మరో ఇద్దరు పురప్రముఖులతో వేదిక నిండుగా ఉంది. ఎత్తైన మేడలమధ్య తాటాకు పాకలా, వాళ్ళ మధ్య తాటాకు పాకలా కూర్చున్న కుమారస్వామి స్ఫుటంగా కనబడడంలేదు.

దాదాపు రెండు గంటలు ఆ రాజకీయ నాయకులు అసర్గళంగా ఆత్మస్తుతి - పరనిందలతో ఉపన్యాసం కొనసాగించారు. ఇక ఆ తరువాత మొక్కుబడి తీర్చుకుంటున్నట్లుగా అసలు కార్యక్రమంలోకి వచ్చారు. కుమారస్వామి మెడలో ఒక పూలదండ వేసి, ఒక శాలువా కప్పారు. ఆ తరువాత ఆయన చేతికర్ర సాయంతో మెల్లగా వచ్చి మైక్ ముందు నిలబడ్డాడు.

అప్పటివరకూ రాజకీయ ఉపన్యాసాలు వినలేక కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళందరూ స్టేజీవేపు తిరిగారు. ముందు వరుసలో కూర్చుని పక్కనున్న స్నేహితుడితో మాట్లాడుతున్న మురళీధర్ కూడా ఆసక్తిగా కుమారస్వామి వేపు చూశాడు. కుమారస్వామికి దాదాపు అరవై ఏళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా ఉన్నాడు. కానీ, ఆయనకు కళ్ళు లేవు. కళ్ళకు నల్లటి కళ్ళద్దాలు పెటుకున్నాడు.

ఆయన మెల్లగా మాట్లాడుతున్నాడు.

“సన్మానం చేయించుకునేటంత గొప్పవాడిని కాను. నేను చిత్రాలు గీయడం మానేసి దాదాపు పదేళ్ళవుతోంది. అకస్మాత్తుగా వచ్చిన ఈ అంధత్వం నాలోని చిత్రకారుడిని చంపేసింది. అయితే, చిత్రాలు గీయాలనే ఆరాటం మాత్రం తగ్గలేదు. రోజూ దేవుణ్ణి ఇలా ప్రార్థిస్తుంటాను. ‘భగవంతుడా, ఒక్క వారం రోజులు నాకు చూపు ప్రసాదించు. నా మనసులోని భావాలన్నిటినీ చిత్రాల్లో నింపేస్తాను. మరీ ఎక్కువ ఆశలేదు. ఒక్కవారం చాలు....’ కానీ, ఆది ఒట్టి ఆశ మాత్రమే. ఈ జన్మ కిక తీరే అవకాశం లేదు.

"నాకు జరిగిన ఈ సన్మానానికి నేను చాలా కృతజ్ఞుడిని. కానీ, కళాకారుణ్ణి పిలిచి శాలువా కప్పడంతో సరిపోదు. ఆ శాలువా కింద నున్న చొక్కాకి ఎన్ని కంత లున్నాయో, ఆ చొక్కా కింద ఉన్న కడుపులో ఎంత ఆకలి ఉంటుందో తెలుసుకుంటే బాగుంటుంది. శాలువాకి బదులు ఆ డబ్బు ఇస్తే ఆ కళాకారుడి కుటుంబం కనీసం కడుపునిండా అన్నమైనా తింటుంది. ఈ శాలువా కప్పినవారిని అవమానం చెయ్యడం నా అభిమతం కాదు. నేటి కాలంలోని కళాకారుల దుఃస్థితి చెప్పా నంతే! మరోసారి కృతజ్ఞతలు చెప్పుకుంటూ సెలవు తీసుకుంటున్నాను" అని కూర్చున్నా డాయన.

చప్పట్లతో ఆడిటోరియం అదిరిపోయింది. మురళీధర్ చప్పట్లు కొట్టలేక పోయాడు. ఆయన మాటలు అతణ్ణి కదిలించాయి. కళ్ళు చెమ్మగిల్లాయి. ఆయన చెప్పిన మాటలు కఠోర సత్యాలు, సన్మానాల పేరిట పూలదండలు, ఫలహారాలు, లైట్లు-వీటికి డబ్బువృథాగా ఖర్చుపెట్టే బదులు ఆ డబ్బును ఆ కళాకారుడికి ఇస్తే కొన్ని రోజుల పాటు ఆ కుటుంబం ఆకలి బాధని మరచిపోతుంది కదా!

కానీ, ఇలా ఆలోచించేది ఎందరు? కీర్తికోసం-ఇతర ప్రయోజనాల కోసం కళాకారుడిని పిలిచి పనికిరాని శాలువా కప్పితాము గొప్ప కళారాధకులమని మీసం మెలేస్తున్నారు. ఇప్పుడీయన మాటలు అటువంటి వాళ్ళకు కళ్ళు తెరిపిస్తే మంచిది. కానీ, అనుమానమే.

"ఏమిట్రా మురళీ ఇంకా అలా కూర్చున్నావ్?

లే...లే..."స్నేహితుడు రాజా తట్టి పిలిచాడు.

ఆ మాటలతో మురళీధర్ ఈ లోకంలోకి వచ్చాడు.

"పద...అందరూ వెళ్ళిపోతున్నారు" అన్నాడు.

ఇద్దరూ బయటికొచ్చి కారులో కూర్చున్నారు.

* * *

"ఏమిట్రా మురళీ అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావ్! దేన్ని గురించి?" రాజా అడిగాడు.

"ఏం లేదు" అన్నాడు మురళి పొడిగా.

"మురళీ! ఈ పట్టణంలోని ధనవంతుల్లో నువ్వొకడివి. పెద్ద పారిశ్రామికవేత్తవు, యువకుడివి అందగాడివి. నీలాటివాడు ప్రతిక్షణం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలోయ్, అలా విచారంగా ఉండకూడదు. నీ విచారానికి కారణం చెప్పు! నేను తీరుస్తాను".

"రాజా! ఇందాక కుమారస్వామిగారి మాటలు విన్నావు కదా! నీ కేం బాధ కలగలేదా?"

"కలిగిందనుకో! కాని మనకు కళంటే ఏమిటో అసలు తెలీదే! ఇక కళాకారుణ్ణి ఏం ఆదరిస్తాం?"

"మిస్టర్ రాజా! కళాకారుణ్ణి ఆదరించడానికి ఆ కళ గురించి తెలియనక్కరలేదు. మన మనసు కొంచెం విశాలంగా ఉంటే చాలు".

"అంటే ఎంత? విజయవాడు ప్లాట్‌ఫారమంత విశాలమా?" నవ్వాడు రాజా.

మురళీధర్ కోపంగా చూశాడు.

"జోక్ కాదు! నేను నిజమే చెపుతున్నా. మనకింత డబ్బుంది. కనీసం ఒక్క కళాకారుడినైనా ఆదుకోలేమా?"

"ఆ గొడవలన్నీ మన కెందుకులే! ప్రభుత్వమే చూసుకుంటుందిలేరా!" ఒక్కమాటలో తేల్చేశాడు రాజా.

"ఇంత మంది కళాకారులను ఆదుకోవడం ప్రభుత్వానికి మాత్రం ఎలా సాధ్యం? మనలాటివాళ్ళం కూడా కాస్త పూనుకోవాలి".

"మురళీ! ఆ కళోద్ధరణ ఏమిటో నువ్వు చెయ్యి.... నన్నిలా బ్రతకనియ్యి".

"నేనూ అదే ఆలోచిస్తున్నాను!"

"దేన్ని గురించి!" ఆశ్చర్యంగా అడిగాడు రాజా. "కుమారస్వామిగారి కోరిక విన్నావు కదా! ఆయనకు వారం రోజులు కాదు, శాశ్వతంగా చూపు వచ్చేట్లు చేస్తాను".

"అబ్బే! అది చాలా కష్టమైన పని మురళీ!"

"ఏం! నీ కెలా తెలుసు?" రాజా వేపు తిరిగి అడిగాడు.

"ఇందాక ఎవరితోనో అంటున్నాడాయన. ఆపరేషన్ కోసం ఢిల్లీ వెళ్ళాలట. దానికి చాలాఖర్చవుతుందట". పెదవి విరిచాడు రాజా.

"రాజా! ఢిల్లీ కాదు. అవసరమైతే ఆయన్ని అమెరికా తీసుకెళ్ళి ఆపరేషన్ చేయిస్తాను. మళ్ళీ చూపు వచ్చేట్లు చేస్తాను. ఆయన చేత మళ్ళీ అద్భుతమైన చిత్రాలు గీయిస్తాను". ఆవేశంగా అయినా దృఢంగా చెప్పాడు మురళీధర్.

రాజా తెల్లబోతూ చూశాడు.

"మురళీ! నీకేమన్నా పిచ్చా? అంత డబ్బు ఒక అనామకుడికోసం ఖర్చు పెడతావా?"

మురళి బాధగా చూశాడు.

"ఛ? అలా అనకురా. ఆయన అనామకుడు కాదు. గొప్పకళాకారుడు. ఆయన గొప్పతనాన్ని గురించి నా చిన్నప్పుడు చాలా విన్నాను. ఆయనలోని కళాకారుడిని తిరిగి బ్రతికించితే నా జన్మ ధన్యమైనట్లే...."

తన్మయత్వంగా చెప్పాడు మురళి. 'వీడికేమన్నా పిచ్చెక్కిందా! లేకపోతే ఏమిటా మాటలు' అనుకున్నాడు రాజా.

'ఆయన అడ్రసు తెలుసుకుని, ఒకసారి ఆయినింటికి వెళ్ళాలి' అనుకున్నాడు మురళీధర్ స్వగతంలా.

రాజాకి అతని మాటలు బొత్తిగా రుచించలేదు. అందుకే ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

* * *

వీథివైపు ఉన్న చెక్కమెట్లెక్కి పైకి వెళ్ళాడు మురళీధర్. గుమ్మానికి చిన్న బోర్డు వేలాడుతోంది.

దానిమీద 'కుమారస్వామి-ఆర్టిస్టు' అని ఉంది 'ఫరవాలేదు-తేలిగ్గానే తెలుసుకోగలిగాను' అనుకుంటూ తలుపు తట్టాడు మురళీధర్.

అయిదు నిముషాల తరువాత పదిహేనేళ్ళ అమ్మాయి వచ్చి తలుపు తీసింది. మురళిని చూస్తూ...."ఎవరు కావాలండీ?" అనడిగింది.

"కుమారస్వామిగారు ఉన్నారా?"

"ఓ! నాన్నగారా! ఉన్నారు రండి".

ఆ అమ్మాయి పక్కకు తొలగింది. మురళీధర్ లోపలికి వెళ్ళాడు.

చిన్న గది, నవారు తెగిపోయిన మంచాలు రెండు. పాత కుర్చీలు మూడు , ఒక చిన్న టేబులు, దరిద్రానికి ప్రతీకగా ఉందా గది.

ఆ అమ్మాయి ఒక కుర్చీ దుమ్ము దులిపి "కూర్చోండి" అంది,

"ఎవరే వచ్చింది!" లోపలినుంచి దగ్గుతూ అడిగిందొక గొంతుక.

ఆ అమ్మాయి చటుక్కున లోపలికెళ్ళి చిన్నగా ఏదో చెప్పింది.

"నాన్నగారితో చెప్పు....!" దగ్గుతూ అందాగొంతు.

ఆ అమ్మాయి అయిదునిముషాల తరువాత మురళీధర్ దగ్గరికి వచ్చింది. "నాన్నగారికి కొద్దిగా జ్వరం తగిలింది. ఆ గదిలో పడుకున్నారు".

"అరె! అలాగా....నేను మళ్ళీ ఇంకోసారి వస్తానమ్మా!" మురళీధర్ లేచి నిలబడ్డాడు.

"ఫరవాలేదు రండి. నాన్నగారే మిమ్మల్ని తీసుకురమ్మన్నారు" అంది.మురళీధర్ ఆ అమ్మాయి వెనకాలే వెళ్ళాడు. ఆ గదిలోకి అడుగు పెట్టగానే ఒక రకమైన వాసన మురళీధర్ నాసికాపుటాలకు అసహ్యంగా తాకింది. కర్చీఫ్‌తో ఒక్కసారి ముక్కునలుపుకుని లోపలకు వెళ్ళాడు.

ఆ గదికి ఒక మూలగా ఉన్న పాతకాలంనాటి మంచంమీద మురికోడుతున్న పరుపుమీద పడుకుని ఉన్నాడు ప్రఖ్యాత చిత్రకారుడు కుమారస్వామి.

అడుగుల చప్పుడు విని "ఎవరూ?" అనడిగా డాయన.

"నాపేరు మురళీధర్...మీతో మాట్లాడాలని వచ్చానండి".

ఆయన లేవబోయాడు. కూతురు సహాయం చేసింది. జ్వరంమూలంగా

అనుకుంటా మరింత చిక్కిపోయాడు. అసలు మందువేసుకున్నాడో లేదో! మురళీధర్ హృదయం జాలితో నిండిపోయింది.

"నేను మిమ్మల్ని చూడలేను. మీరెవరో?...." మురళీధర్ జాలిగా చూశాడు.

"మీ గురించి నాకు తెలుసు. నేను బిజినెస్ చేస్తుంటాను. వారం క్రితం టౌన్‌హాల్లో మీకు సన్మానం జరిగింది కదా! ఆ సభకు నేనూ వచ్చాను. అక్కడ మీ ఉపన్యాసం విన్నాక మిమ్మల్ని చూడాలని వచ్చాను".

"చాలా సంతోషం.... ఇంటి కొచ్చిన వాళ్ళను మర్యాద చేసేస్థితిలో లేను- క్షమించండి..." మెల్లగా అన్నా డాయన.

మురళీధర్ చలించిపోయాడు. "మీరలా అనుకోకుండి. మీ వంటి గొప్ప చిత్రకారుల చేతిమీదుగా ఒక గ్లాసు మంచినీళ్ళు తాగినా చాలు.... అదే గొప్ప అదృష్టం.

ఆ మాటలతో ఆయన ముఖం కళకళలాడిపోయింది. ఆవేశం, బాధ" ఆయనలో పెల్లుబికాయి.

"బాబూ! మీరెవరోకానీ మిమ్మల్ని ఒక్కసారి నా కళ్ళారా చూడాలని ఉంది. నా కళ్ళు పోయాక నాతో ఇలా ఆదరంగా మాట్లాడిన వాళ్ళు లేరు. ఎండిన చెట్టు దగ్గరకు పక్షులెందుకు వస్తాయి. బాబూ! అప్పటి వరకూ నా చుట్టూ చేరి నాకు భజన చేసిన వాళ్ళంతా నా కళ్ళుపోగానే నన్ను వెలివేశారు దరిద్రుడిని, గుడ్డివాడిని నాతో వాళ్ళకేం అవసరం? నాదగ్గరేముందని వస్తారు? చెప్పునాయనా". దీనంగా అంటున్నాడు. ఆయన కంఠం గద్గదమైంది. ఆ మాటలు వింటోంటే మురళీధర్ కళ్ళు చెమ్మగిల్లాయి.

"బాబూ! ఒకప్పుడు నేను గొప్ప చిత్రాలు గీశాను. నా స్నేహితులు వాటిని అమ్మి డబ్బు సంపాదించమని సలహా ఇస్తుండేవారు. కానీ ఈ మనుషులకు చిత్రాలెందుకు నాయనా? అసలు కళ లెవరి క్కావాలి? కళలంటే చులకన. కళాకారులంటే హేళన. ఒకసారి నాస్నేహితుడొకడు బలవంతంగా నా చిత్రాన్నొకదాన్ని వందరూపాయలకు అమ్మించాడు. కానీ నెల రోజుల తర్వాత ఆ వ్యక్తి ఆ చిత్రాన్ని తీసుకుని నా దగ్గరకే వచ్చిడు. 'దీన్ని మూలపడేస్తే చెదలు పట్టింది. ఈ చిత్రం లాంటిదే ఇంకొకటి గీసివ్వండి' అన్నాడా వ్యక్తి చాలా నిర్లక్ష్యంగా! ఆ చిత్రాన్ని చూడగానే నాకు దుఃఖం వచ్చింది. బిడ్డను లాలిస్తున్న మాతృమూర్తి చిత్రమది. నేను గీసినప్పుడు ఆమె ముఖంలో ఆనందం ఉంది. కానీ ఇప్పుడు....కళ్ళకింద చెదలు తినెయ్యడంతో ఆమె ఏడుస్తున్నట్లుగా ఉంది. 'నన్నిలా నిర్దాక్షిణ్యంగా అమ్ముతావా!" అన్న బాధ కూడా ఆమె ముఖంలో కన్పించింది నాకు. ఆ చిత్రం గీసివ్వకపోవడమే కాదు.... ఎంత బాధలో ఉన్నా ఇంకే చిత్రమూ అమ్మలేదు. నేను గీసినవన్నీ నా దగ్గరే భద్రంగా ఉంచుకున్నాను. అప్పుడప్పుడు

వాటిని చూసుకుంటూ తృప్తిపడుతుంటాను. ఇప్పుడున్న ఈ స్థితిలోనూ నన్నిలా బ్రతకనిచ్చేవి ఆ చిత్రాలే బాబూ".

"మీరు వాటిని చూస్తారా?"

మురళీధర్ ఆశ్చర్యంగా అడిగాడు. ఆయన నవ్వాడు. "ఎందుకంత ఆశ్చర్యం! ఆ చిత్రాలన్నీ నా కళ్ళున్న రోజుల్లో నేనే వాటిని బైండు చేయించాను. ఏ చిత్ర మేదో నాకు తెలీదా?"

"మీ కళ్ళు ఎలా పోయాయి?"

"కంటిలోని నరాలు దెబ్బతిన్నాయి"

"ఎవరికేనా కంటి డాక్టరుకు చూపించుకోలేకపోయారా?" మురళీధర్ అడిగాడు.

ఆయన నిట్టూరుస్తూ- "చూపించుకున్నాను. ఆపరేషన్ చెయ్యాలట. వేలల్లో ఖర్చు. తినడానికే లేని వాడిని....నే నంత డబ్బు ఎలా తీసుకురాను?"

"మీకు మళ్ళీ కంటిచూపు వస్తే?" ఆయన ముఖంలోకి పరిశీలనగా చూస్తూ అడిగాడు మురళీధర్.

ఆయన ముఖం క్షణకాలం వింత వెలుగుతో ప్రకాశించింది.

"అంత అదృష్టమా బాబూ"?

మురళీధర్ ఏదో చెప్పబోయాడు. ఇంతలో ఆ అమ్మాయి రెండు గ్లాసులతో వచ్చింది.

"తీసుకోండి'. మురళీధర్‌కి అందించింది. గ్లాసులో నల్లటి ద్రవమేదో ఉంది. దాన్ని చూసి మురళీధర్ భయపడ్డాడు.

"టీ తీసుకోండి. పాలు లేవు." ఆ అమ్మాయి బిడియపడుతూ అంది.

"ఎండా కాలంలో ఈ టీ చాలా మంచిది! తీసుకోండి." ఆయన అన్నాడు.

మురళీధర్ బలవంతంగా విషంతాగుతున్నట్లు టీ తాగాడు.

"బాబూ! మీరు నా చిత్రాలు చూస్తారా!" అన్నాడాయన హఠాత్తుగా.

"అమ్మాయ్! నా బైండు పుస్తకాలు తీసుకురా...." ఆయన ఉత్సాహంగా కూతురితో అన్నాడు.

కానీ ఆ అమ్మాయి కదలలేదు. ఏదో సందేహిస్తూ అలాగే నిలబడింది.

"వెళ్ళవేం!" ఆయన కసిరాడు. అది గ్రహించి "తెస్తాను" అని ఆ అమ్మాయి నసిగింది.

"చెప్పిన పని చెయ్యడం నేర్చుకో". ఆయన విసుక్కున్నాడు.

"నువ్వు టీ తాగడం అయ్యాకతెస్తాను". అంది "ఆఁ... ఇదిగో గ్లాసు". ఆయన గ్లాసులో ఉన్నదంతా గొంతులో ఒంపుకుని ఇచ్చాడు.

"వెళ్ళు-త్వరగా తీసుకురా...."

ఆ అమ్మాయి ముఖం నల్లబడింది. బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళింది. ఆ అమ్మాయి బాధేమిటో, ఆ అమ్మాయి ఎందుకలా ఉందో మురళీధర్‌కి

అర్థం కాలేదు.

పది నిముషాల తరువాత పెద్ద బౌండు పుస్తకాలతో భారంగా అడుగులు వేస్తూ వచ్చింది. వచ్చి తండ్రికి అందించింది.

వాటిని తాకగానే ఆయన కెక్కడ లేని సంతోషం కలిగింది. శరీరం గగుర్పొడిచింది. ఆ ఉత్సాహం తొణికిసలాడింది. వాటిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. వాటి మీద చేత్తో మృదువుగా రాశాడు. ప్రేమగా చెంపకు ఆనించుకున్నాడు.

"మురళీధర్‌గారూ! మీ రిలా దగ్గరగా కూర్చోండి. ఒక్కొక్క చిత్రాన్ని గురించి నేను మీకు వివరించి చెపుతుంటాను. అప్పుడు మీకు దానిలోని గొప్పదనం అర్థం అవుతుంది" అన్నాడాయన.

మురళీధర్ ఆయనకు దగ్గరగా కుర్చీజరుపుకున్నాడు. ఆ అమ్మాయి కూడా తండ్రి పక్కనే నిలబడింది.

ఆయన బౌండు అట్టతొలగించాడు. ఆ తర్వాత దాని మీదున్న గ్లేజ్ కాగితం కూడా ఎత్తి "మురళీధర్‌గారూ! ఈ చిత్రం చూశారా? శీతాకాలపు సూర్యోదయం. శీతాకాలంలో సూర్యుడు కూడా చలితో బాధపడుతుంటాడు. బద్ధకంగా మంచుదుప్పటిలో నుంచి బయటకు రాలేక ఇబ్బంది పడుతుంటాడు. నేను ఆ భావాలతో గీశా నీ చిత్రం. చూడండి-రంగులు ఎంత బాగున్నాయో!" ఆయన కళ్ళ ఎదురుగా చిత్రాన్ని చూస్తున్నట్లే ఉత్సాహంగా వివరిస్తున్నాడు.

మురళీధర్ ఆయన చెప్పిన చోట చూశాడు. కానీ అసలక్కడ ఏ చిత్రమూ లేదు. తెల్లటి డ్రాయింగు పేపరు మాత్రమే ఉంది.

'ఏమిటిది! చిత్రం ఏదీ? ఆయన చెపుతున్నదేదీ అక్కడ లేదే! మురళీధర్ ఆశ్చర్యంతో తలమున్కలయ్యాడు.

"మురళీగారూ! చిత్రం బాగుంది కదూ. ఇక ఇది చూడండి" అంటూ మరో పేజీ తిప్పాడాయన.

"ఇది జలకన్య చిత్రం". ఆయన వివరిస్తున్నాడు. కానీ అక్కడా ఏ చిత్రమూ లేదు. మురళీధర్‌కి అంతా అయోమయంగా ఉంది. ఇక భరించలేక పోయాడు. ఆయన వేపు చూసి ఏదో అనబోయాడు.

ఇంతలో ఆ అమ్మాయి చటుక్కున ముందుకు వచ్చింది. మురళీధర్ భుజాన్ని తట్టి, ఏం మాట్లాడవద్దనట్లు సైగ చేసింది.

మురళీధర్ తెల్లబోయాడు. కానీ దీంట్లో ఏదో రహస్య ముందని గ్రహించాడు. అదేమిటో తరువాత ఆ అమ్మాయి నడిగి తెలుసుకోవాలను కున్నాడు.

ఆయన చిత్రాల గురించి వివరిస్తూ వాటిని చూపిస్తోంటే అవి అక్కడున్నట్లుగానే భావించి, వాటిని చూస్తూ ఆయనని ఆనందపరుస్తున్నాడు. అన్నీ చూడటానికి గంటపైగా పట్టింది.

"ఎలా ఉన్నాయండీ?" ఆయన అడిగాడు.

"చాలా బాగున్నాయి....... నాకూ రెండో మూడో ఇవ్వండి........కొనుక్కుంటాను....." అన్నాడు మురళీధర్.

"నేను చిత్రాలు అమ్మకోనండీ. దారిద్ర్యాన్నైనా భరిస్తాను కానీ, నా కళను రూపాయికీ, అర్ధకీ అమ్ముకోలేను. ఇవి నా ప్రాణం... నా ఊపిరి...." ఆవేశంగా అన్నాడాయన.

"సారీ! నా ఉద్దేశం అది కాదండీ! పోనీండి, మీకు కష్టం కలిగించి ఉంటే మన్నించండి. నేనే అప్పుడప్పుడు మీ దగ్గరకు వచ్చి మీ చిత్రాలు చూస్తాను" అన్నాడు మురళీధర్ అనునయంగా.

ఆ మాటలతో ఆయన ముఖం ప్రసన్నమైంది. "అబ్బే! నాకు కోపం లేదండీ. మీలాటి సహృదయులకు ఏదో ఒక చిత్రాన్ని నా కానుకగా ఇస్తాను. కానీ ఇప్పుడు కాదు'

"మీ ఇష్టం.... నే నిక వెళ్ళొస్తాను.... మళ్ళీ కలుస్తానండీ". ఆయన దగ్గర సెలవు తీసుకుని బయటి కొచ్చాడు మురళీధర్.

అతనికి అసలు విషయం తెలుసుకోవాలని తహతహగా ఉంది. అతని ఆలోచన గ్రహించినట్లుగా ఆ అమ్మాయి అతని వెనకాలే వచ్చింది.

"మా అమ్మ ఆ గదిలో ఉంది. ఒక్కసారి మిమ్మల్ని రమ్మంది. రాగలరా?" అంది.

ఆ గదిలో కెళ్ళాడు మురళీధర్. ఆ గదిలో ఒక కుక్కిమంచంలో అస్థిపంజరం లాటి ఆకారం కదలాడుతూ కనిపించింది. హఠాత్తుగా చూసి జడుసుకున్నాడు.

"మా అమ్మ" అందా అమ్మాయి. ఆ ఆకారం చీర చుట్టుకుంది కాబట్టి స్త్రీ అనుకోవాలి. ఆమె విపరీతంగా దగ్గుతోంది.

"అమ్మా, ఆయనొచ్చారే."

ఆవిడ అతి కష్టం మీద లేచి కూర్చుంది. కూర్చోలేక విపరీతంగా వణికి పోతోంది. కూతురు తల్లిని రెండు చేతులతో పట్టుకుంది.

"బాబూ - అలా కూర్చోండి..."

మురళీధర్ స్టూలు మీద కూర్చున్నాడు. ఆ దారిద్ర్యం, ఆ మనుషులు, గదిలో వచ్చే వాసన మురళీధర్‌కి దుర్భరంగా ఉంది. ఇంతవరకూ ఈ లోకంలోని అష్టైశ్వర్యాలనే చూశాడు. గర్భదారిద్ర్యాన్ని ఇప్పుడు చూస్తున్నాడు. అతని మనస్సు బాధపడుతోంది.

"బాబూ, మా ఆయన చూపిన చిత్రాలు చూశారా?"

"ఆఁ-చూశానండీ...."

"ఈ మధ్య కాలంలో మాఇంటి కొచ్చి ఆయన చిత్రాలు చూసిన వారు మీరొక్కరే..."

"కానీ...."

"నన్ను చెప్పనివ్వండి బాబూ. ఈ సృష్టిలో అతిభయంకరమైనది ఆకలి... ఆయనకు కళ్ళుపోయాయి. మాది పెద్ద సంసారం-పిల్లలు చిన్నవాళ్ళు...పైసా సంపాదించి పెట్టే దిక్కులేదు. కంటి ముందు పిల్లలు ఆకలికి ఏడుస్తోంటే ఏ తల్లి తట్టుకోగలదు?

నేనూ భరించలేక పోయాను. కానీ ఏం చేయాలో తోచలేదు. మా పరిస్థితి చూసి ఆయన స్నేహితుడొకడు ఒక సలహా చెప్పాడు. మొదట భయపడ్డాను అది విని. కానీ పిల్లల ఆకలి ముందు ఏ భయాలూ నిలవలేదు. గుండె రాయి చేసుకున్నాను. ఆయనకు తెలీకుండా ఒక్కొక్క చిత్రాన్నీ ఆ స్నేహితుడి ద్వారా అయిన కాడికి అమ్మాను...."

దగ్గు తెర అడ్డు రావడంతో ఆవిడ ఆగింది. మురళీధర్ ఆశ్యర్యంగా వింటున్నాడు.

"బాబూ, నేను చేసింది చాలా ఘోరమైన పని.... నాభర్తకు తీరని ద్రోహమే చేశాను. కానీ ఏం చేయను? నా పిల్లలు నాకళ్ళ ముందే ఆకలికి చావడం నేను సహించలేకపోయాను. ఆ చిత్రాల స్థానంలో తెల్ల కాగితాలుంచాను. కానీ ఇదంతా తెలీని ఆయన ఇంకా ఆ చిత్రాలు ఉన్నట్లే భ్రమపడి రోజుకోసారి మనోనేత్రంతో వాటిని చూసుకుని ఆనందిస్తుంటారు. బాబూ? మీరు నిజం చెప్పి ఆయన ఆనందాన్ని పాడుచేయకండి. ఆ చిత్రాలు లేవని తెలిస్తే ఆయన గుండె పగిలి మరణిస్తారు. నాయనా? నా పసుపు కుంకుమలను కాపాడు.... నేనేం చెయ్యను!.... కావాలని అలా చేయలేదు. నేను అశక్తురాలిని. 'నా తప్పు కాదు." ఇక ఆపై మాట్లాడలేక ఆవిడ ఏడవసాగింది. క్షణం ఆగిమళ్ళీ చెప్ప సాగింది:

"ఆయన పరిస్థితి వివరించి సహాయం చేయమని ఎందరినో ప్రాధేయపడ్డాడు బాబూ... కానీ ఒక్కరూ సహాయం చేయలేదు. ఆయన గొప్ప చిత్రాలు గీశారు కానీ, ఆ గొప్పతనం ఎవరి క్కావాలి బాబూ? అందుకే ఇక వేరే గతి లేక రూపాయికీ.... అర్ధకీ కూడా ఆ కళామతల్లిని అమ్మవలసి వచ్చింది నాయనా..." ఆవిడ గుండె పగిలేలా ఏడుస్తోంది.

మురళీధర్ నిశ్చేష్టుడయ్యాడు.

ఆకలి కథలు విన్నాడు. సినిమాల్లో చేశాడు. కానీ ఈ ప్రత్యక్ష దృశ్యం భరించరానిదిగా ఉంది.

"ఆ భగవంతుడైనా నన్ను క్షమిస్తాడా నాయనా!"

ఆవిడ ఏడుస్తూ, దగ్గుతోంది.

మురళీధర్‌కి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'ఆకలీ! నువ్వెంత భయంకరమైన దానివి? ఎన్ని ఘోరాలైనా చేయించ గలవు!.... ఆ రోజుల్లో ఆ కుటుంబాన్ని ఒక్కరైనాఆదుకుంటే ఎంత బాగుండేది!.

ఆలోచిస్తున్న మురళీధర్‌కి హఠాత్తుగా తానొచ్చిన పని గుర్తుకొచ్చింది.

"ఆయనకు మళ్ళీ కళ్ళు వస్తే...."

మనసులోని మాటని పైకే అనేశాడు. ఆవిడ విన్నది. విని భయపడింది. కంగారు పడింది.

"వద్దు... వద్దు... ఆయనకు మళ్ళీ కళ్ళు రాకూడదు... వస్తే.... ఈ నిజం తెలిస్తే... ఆయన బ్రతకరు. ఆయనకు చూపు రానివ్వకు...."

ఆవిడ దుఃఖంతో వణికిపోతూ కూర్చోలేక వెనక్కి వాలిపోయింది!